




# మనంకోళ్ళు

- కప్పగంతుల మల్లిఖార్జునరావు

చిన్నతనంలో ఎవ్వరూ ఏర్పాటు చేయకుండా తయారైన మా వానరసేనలో ముఖ్యులం నలుగురం.

ఆంజనేయులు రాకుమారుడిలా వుండేవాడు. డబ్బు, ఆరోగ్యం, దర్జా, దర్పం వుట్టి పడుతుండేవి వాడిలో. మా సేనకయ్యే చిల్లర ఖర్చులన్నీ వాడే భరిస్తుండేవాడు. అయితే మంత్రో, లేకపోతే సినిమా ప్రొడ్యూసరో అవుతాడని ఆటలు పట్టించే వాళ్ళం. వాడు నిరీశ్వరవాది.

పాండురంగం ఏకసంతగ్రాహి. సన్నటి తలలో కొండంత బుర్ర వుంది. మా అందరి హోంవర్కులూ వాడే చేసేవాడు. అయితే పిచ్చోడో, లేకపోతే సైంటిస్టో అవుతాడని అనుకోనే వాళ్ళం మేమంతా.

హనుమంతుడిలా మా సేనకు రాఘవుడు రక్ష. ఎద్దంత శరీరం, మొండి ధైర్యం - వాడి ఆస్తులు. పిడవాదన చేయటంలో వాడికి వాడే సాటి. 'బండ మనిషి' అని బిరుదు

యిచ్చేశాం. వాడి పెద్ద వాళ్ళకి వాడిని ప్లీడరుని చేయాలని వుందని చెప్పేవాడు. కానీ వాడు అవుతే పోలీసు, లేకపోతే రౌడీ అవుతా డని మేమనుకొనేవాళ్ళం.

యిక నేను? క్లాసు పుస్తకాలను మినహాయించి అడ్డమైన పుస్తకా లను చదివి, నాటకాలు చూచి, మిగతా వారికంటే భిన్నంగా కొటే షన్స్ యిస్తూ మాట్లాడటం తప్ప, నాకు ప్రత్యేకతేం లేదు. కాగా పేదరికం, చదువు తలకెక్కక పోవటం, ఆకలి లాంటి అవలక్షణా లెన్నో వుండటం వల్ల నాకంటూ కోరిక లేమీ వుండే అవకాశం లేక పోయింది.

"ఫర్వాలేదు లేరా. అంజిగాడు మంత్రి అవుతే నిన్ను ఆస్థానకవిని చేస్తాడు. ప్రొడ్యూసర్ అవుతే సినిమా రచయితను చేస్తాడు" అనే వారంతా.

మేం నలుగురం ఎప్పుడూ కల్సి తిరిగే వాళ్ళం. ఏ పని చేసినా కల్సి చేసేవాళ్ళం.

"మంచం కోళ్ళలా బాగున్నార్రా మీ నలుగురూ. స్నేహమంటే మీదే- మంచం కోళ్ళ స్నేహం" అనేవాడు ఆంజనేయులు నాన్న మమ్మల్ని చూచినప్పుడల్లా.

అయితే యీ నాలుగు మంచం కోళ్ళు వొకేకర్రతో చేసినవి కావు. ఆంజనేయులూ, రాఘవుడూ వాళ్ళ కున్న సిరిసంపదల వల్ల టేకు కర్రల్లాంటి వాళ్ళు. నేనూ, పాండు రంగం నాటు కర్రల్లాంటి వాళ్ళం.

వాళ్ళిద్దరూ తల వైపు కోళ్ళు. మేమిద్దరం కాళ్ళ పట్టె దగ్గర కోళ్ళం. సన్నిహితత్వం బట్టి కూడా చిన్నతనంలో నేనూ, పాండురంగం దగ్గరి వాళ్ళం.

ఇంటర్ పాసయిందాకా యిలా గడిచిపోయింది. చిత్రమేమిటంటే ఇంటర్ పాసయి డిగ్రీ కోర్సు చదవటానికి మా జిల్లా కేంద్రానికి బయలుదేరింది యీ నాలుగు మంచం కోళ్ళే. నాకు ఆర్థిక స్థితి అడ్డం వచ్చి అజ్జా యిస్తుంటే ధైర్యం చెప్పి తీసికెళ్ళేడు ఆంజ నేయులు.

ఒకే గది. వొకే హోటల్లో భోజనం. కాల్చేది వొకే బ్రాండు సిగరెట్లు. అవుతేనేం? డిగ్రీలో చేరిన కొద్ది నెలల్లోనే కొత్త వాతా వరణం, మా నలుగురి మధ్యనున్న మంచం కోళ్ళ బంధాన్ని సడలించ సాగింది.

ఆంజనేయులికి వాళ్ళ అమ్మ కోరికపై రజస్వల కాని పిల్లతో పెళ్ళయింది. ఆ తర్వాత కొన్నా ళ్ళకు వాళ్ళమ్మ చనిపోయింది.

వాడికూ్కడా ఏదో జబ్బు పట్టు కొంది. రాజకుమారుడి వుత్సాహం స్థానంలో ఆధ్యాత్మిక చింతనలో పడ్డ దీర్ఘకాల్ధరోగి చోటు చేసు కొన్నాడు వాడిలో. శ్రీమహావిష్ణువు అస్తమానం శేషతల్పంమీద పడు కొని వున్నట్లు, అర్ధ నిమీలిత నేత్రాలతో సిగరెట్‌పై సిగరెట్ కాలుస్తూ రూములో పడుకోటం అలవాటు చేసుకొన్నాడు.

రాఘవుడికి కొత్త స్నేహాలు ఏర్పడ్డాయి. ఆటల్లో కాస్తంత పేరొచ్చింది. చిన్నతనంనుంచి వాడికి వూళ్ళో కొట్లాట సంఘట నల్ని చిలవలు పలువలు చేసి చెప్పటం సర్దా.

జిల్లా కేంద్రంలో కొత్త పరి చయా లయ్యాక వాడి ధోరణి మారింది. కబుర్లు చెప్పుతున్నట్లు కాక, రౌడీ తనే అయినట్లు, తనంటే వూళ్ళో మిగతా రౌడీలు హడలిపోయి స్నేహం చేయాలని తాపత్రయ పడుతున్నట్లు పోజులు పెట్ట సాగేడు.

రాసిన అరడజను కథలు పత్రి కల్లో ప్రింటయి, నటుడుగా నాట కాల్లో పేరొచ్చాక, నాకు ఈ శుష్క స్నేహాలు, కబుర్లు, హాస్యా స్పదంగా తోచసాగాయి. నేను మరో లోకంలో విహరిస్తున్నా.




ఈ స్థితిలో పాండురంగానికి నా లోకంకన్నా, రాఘవుడి లోకం ఆకర్షణీయంగా కన్పించిందేమో. ఈ మంచంకోళ్ళ సాన్నిహిత్యంలో కూడా గొప్ప మార్పొచ్చింది.

పాండురంగం రాఘవుడికి దగ్గరయ్యాడు. రూములో రౌడీల కబుర్లు ఎక్కువయ్యాయి.

ప్రస్తుతః మా నలుగురిలోకి స్థిర సంకల్పం, ధైర్యం కలవాడు- అంజనేయులు. వొట్టి పిరికి గొడ్డు పాండురంగం. అన్నిటికీ భయం, అనుమానం.

అలాంటిది ఆంజనేయుల్లో పైకి చెప్పకపోయినా ఏదో పిరికి

తనం ప్రవేశించింది. పలాయ నత్వంగా సిగరెట్లని, చిరునవ్వుని ఆశ్రయించాడు.

పాండురంగం రాఘవుడిలా మీసాలు పెంచాడు. తనూ రౌడీల కబుర్లు చెప్పసాగించాడు. ఇక రాఘవుడి సంగతి చెప్పేదేముంది? విజృంభించాడు.

"ఒరేయ్, ఆ మస్తానయ్య గాడు లేడూ? కమిటీ రౌడీనని నీల్గుతుంటాడే - వాడు. వాడికీ మనకీ పడిందివాళ. మన తడాఖా చూపించా ననుకో" అన్నాడోరోజు రూము కొస్తూనే.

మస్తానయ్య పేరు తెలీనివాళ్ళు ఆ జిల్లాలోనే ఎవ్వరూ వుండరు. పట్టణంలో ప్రతి ఒక్కరికీ అతని పేరు చెప్పితేనే హడల్.

మస్తానయ్య కేవలం రౌడీ కాదు. రౌడీలకు రౌడీ. కండలు తిరిగిన ఒళ్ళు, మెలికలు తిరిగిన పేద్ద మీసం, ముందుకు పొడుచు కొచ్చిన పెద్ద పొట్ట, ఒత్తైన కనుబొమలు, బట్టతల....అతడిని చూచే సినిమా వాళ్ళు రౌడీలకు మేకప్ చేస్తారా అనిపించేలా వుండే వాడు. నాకైతే ఇతడిని చూచి జనం ఎందుకు భయపడతారా-అని పించేలా వుండేవాడు.

కానీ అతని సాహసకృత్యాలను గురించి కథలు కోకొల్లలు.

మస్తానయ్య పొద్దున్నే లేచి శిష్యులతో సహా బజారున పడే వాడు. బకాసురుడికి తిండి పంపి నట్లు రోజుకొక్క హోటల్ వాళ్ళు వాళ్ళందరికీ వంతుల వారీగా సుష్టుగా ఫలహారాలు పెట్టాలి. హోటలుకు ముందున్న కిళ్ళీబంక్ వారు కిళ్ళీలను కూడా ఫ్రీగా సప్లై చేస్తారు. కార్యక్రమాలు ముగించు కొని తిన్నది అరిగిందాకా పుర ప్రదక్షిణాలు చేయటం మస్తానయ్య అండ్ కో వారి నిత్యకృత్యం.

సాయంకాలం అయ్యేసరికి శిష్యులు వాళ్ళ వాళ్ళ బిజినెస్ స్థావరాలు చేరుకొంటారు. వేశ్యా గృహాలు, కల్లుపాకలు, బ్లాకులో సినిమా టిక్కెట్లు అమ్మకం, పిక్ పాకెట్లు- అందరికీ ఏదో వృత్తి వుంది.

మస్తానయ్య మాత్రం వీటికి అతీతుడు. శిష్యులకేదన్నా ప్రమాదం వచ్చినా, వారి మధ్య అంతః కలహం వచ్చినా అతడికి కబురు పోతుంది. ఎంత వారికీ అతని ఆజ్ఞ సుగ్రీవాజ్ఞే.

రాజకీయ నాయకుల దగ్గరా, అధికారుల దగ్గరా మస్తానయ్యకు మంచి పలుకుబడి వుందని అం టారు. పెద్ద పెద్ద అవసరాలొస్తే

తప్ప అతను కార్యరంగంలోకి దిగడని ప్రతీతి.

మస్తానయ్యకు 'మీసాల రౌడీ' అన్న ముద్దు పేరు వుంది. 'వస్తాద్ గురు' అన్న గౌరవనామం వుంది. 'షేర్‌హింద్' అన్న బిరుదనామం వుంది. ఇవన్నీ ఎవరిచ్చారో తెలీదు. కానీ ఈ బిరుదు లేవీ తగిలించకుండా పొడిగా పేరుపెట్టి పిలిస్తే మస్తానయ్యకు అమితకోపం వస్తుందని చెప్పుకొంటారు. చీల్చి చెండాడుతాడట.

ఇంతకథ, చరిత్రవున్న మస్తానయ్యకు నిన్నగాక మొన్న కళ్ళు తెర్చిన రాఘవుడు, తన తడాఖా చూపించాడు. గొప్ప జోక్!

"కోతలు కొయ్యటానికి మస్తానయ్య సొరకాయకాదు - టైగర్. నీ వాగుడు తెలిస్తే చంపేస్తాడు. జాగ్రత్త" అన్నాను వూరుకోకుండా.

రాఘవుడి అభిమానం దెబ్బతింది. సపోర్టు కోసం ఆంజనేయులు వైపు చూచాడు. వాడు సిగరెట్ పొగ గాలిలోకొదిలి చూస్తున్నాడు.

"రాఘవుడి సంగతి నీకు తెలీదులే. ఇదేం కథలు రాయడం, రంగు పూసుకొని డైలాగు లొప్ప చెప్పటం అనుకొన్నావా? గుండెలకి సంబంధించిన విషయం. వాడు మస్తానయ్యలాంటి వాళ్ళకు పదిమందికి సమాధానం చెప్పగలడు. ఏమనుకొన్నావో?"

అన్నది పాండురంగం. నిన్నటిదాకా నేనేదంటే అది అవునని వంతపలికిన నా హీరోయిన్.

నాలో పట్టుదల పెరిగింది. మాటా మాటా పెరిగింది.

"మస్తానయ్యతో పోట్లాట అక్కర్లేదు. మేం చూస్తుండగా బజార్లో అతనితో మాట్లాడి షేక్‌హాండ్ చేసిరా చాలు. నీ ధైర్యాన్ని వొప్పుకొంటా" ఛాలెంజింగ్‌గా అన్నాను.

ఆంజనేయులు అప్పటికి తపస్సమాధి నుంచి బయటికొచ్చాడు.

"వాడు చెప్పింది బాగుంది" అంటూ నాకు వత్తాసు పలికాడు.

"ఆఫ్ట్రాల్ ఆ పనికి నేనక్కర్లేదు, రంగడు చేసొస్తాడు. చెయ్యి కలపటం కాదు - బుజాలు చరిచొస్తాడు."

"కానీ పాతిక రూపాయల పందెం కట్టాలి."

అది నా బీద తనపు బలహీనత మీద రంగడు చేసిన దండయాత్ర. ఎప్పటిలాగానే ఆంజనేయులు ఆదుకొన్నాడు. నేను ఓడితే తను పాతిక ఇస్తానన్నాడు.

పరీక్షా సమయం త్వరలోనే వచ్చింది. నలుగురం ఆ రోజు భోజనం చేసి వస్తుంటే మస్తానయ్య రోడ్డుమీద ఒంటరిగా వెళ్తూ కని పించాడు. ఆంజనేయులు సిగరెట్ల దిండు కొనుక్కొచ్చుకోటాని కెళ్ళాడు.

"ఏరా! యిప్పుడు చూపిస్తావా ఏమిటి నీ ప్రతాపం?"

కాస్సేపు నేను అలా మాటల్తో పొడిచేక పాండురంగానికి కాకె క్కింది. యీలోగా ఆంజనేయులు దిండు కొనుక్కొని వచ్చాడు. నలు గురం త్వరత్వరగా నడిచి మస్తా నయ్య దగ్గరికి చేరుకొన్నాం.

పదిసార్లు మస్తానయ్య పక్క దాకా పోయి, భయంతో మాటరాక నిలబడిపోయి మమ్మల్ని చేరు కొన్నాడు. ధైర్యపు గాలిని రాఘ వుడు పంపుకొట్టినట్టు కొట్టగా చివ రికి పులి బోనులోకి ప్రవేశించే మేకలా, ముందు వెనుకలు చూడని అభిమన్యుడిలా వెళ్ళి మస్తానయ్య ముందునిల్చున్నాడు పాండురంగం.

మస్తానయ్య ఆగేడు. ఏం మాట్లాడాలో తెలీక వణుకుతూ వో క్షణం నిలబడ్డాడు పాండురంగం.

"ఏంటి?" మస్తానయ్య పలక రించాడు.

"ఏం లేదు....ఏం లేదు. నే.... న్నే ను....మస్తానయ్యగారూ ...." వణికిపోతూ అన్నాడు.

అంతే! పిడుగు పడ్డట్లయింది.

"ఎవఢ్రా నువ్వు? షేర్ హించ్‌ని, మీసాల రౌడీని, వస్తావ్ గురూని, పేరు పెట్టి పిల్చేమొగోడి వొచ్చావా? ఎవఢ్రా నువ్వు!"

పాండురంగం చొక్కా పట్టు కొన్నాడు. తడిసిన పిట్టలా వణుకు తున్నాడు వాడు.

"బతకాలని లేదుట్రా నీకు? బొడ్డుకోసినట్లు పిలుస్తున్నావ్?"

ఉన్నట్లుండి పాండురంగం పెద్దగా ఏడుపు లంకించుకొన్నాడు. పేంటు తడిసింది. మస్తానయ్యా చేతులు మీసాల మీదికి పోయాయి.

"ఒరేయ్, రంగడిని తంతా డేమో. తడాఖా చూపించానన్నా వుగా? వెళ్ళరా నువ్వు." రాఘవుడు మా మాటల్ని పట్టించుకోలేదు. పక్క నందులో పడి అదే పరుగు.

"వేలుతో నెట్టే కింద పడి బొక్కేడు రక్తం కక్కుకొని చస్తావు. 'వుఫ్' మని వూదితే ఆకాశంలోకి ఎగిరిపోతావ్. చొక్కా పట్టుకొంటే వుచ్చ కార్చే వెధవ్వి. థూ....ఎదవనాయాల పిరికి...."

నేనూ, ఆంజనేయులూ వెళ్ళి అతడికి క్షమాపణలు చెప్పించి తీసుకొచ్చాం పాండురంగాన్ని.

ఆ తర్వాత రాఘవుడితో మాట్లాడటం మానేసేడు పాండురంగం. రాఘవుడు మా గది వదిలి వేరే గది తీసుకొన్నాడు.

డిగ్రీ అయ్యాక నేను గుమాస్తా వుద్యోగాన్ని చేజిక్కించుకొన్నా. పాండురంగం యమ్మెస్సీకి వెళ్ళేడు. పోలీస్ సబిన్స్పెక్టర్ వుద్యోగానికి ప్రయత్నించి ప్రయత్నించి విఫలుడై వూళ్ళోనే ప్లీడరు గుమాస్తా వృత్తిని చేపట్టాడు రాఘవుడు.

ఆంజనేయుల్తో జీవితం రకరకాల ఆటలాడుతోంది!

* * *

పాండురంగాన్ని చూడగానే నొక్క క్షణంలో యిదంతా నా మనస్సులో మెదిలింది.

"ఏరా! గుడ్లప్పగించి చూస్తావ్! మర్చిపోయావా ఏమిటి?"

అప్పుడు ఆడపిల్లలా నాజుగ్గా వుండేవాడు. యిప్పుడు ఎత్తుగా, దృఢంగా, పెద్ద పెద్ద మీసాలతోటి, పోలీస్ దుస్తుల్లో హుందాగా వున్నాడు.

యమ్మెస్సీ తర్వాత వాడు కొంత కాలం లెక్చరర్గా చేసేడు. అప్పుడే క్లాస్వన్ ఉద్యోగానికి సెలెక్ట్ అయ్యాడు. చిత్రమేమంటే ఎన్నో వుద్యోగాలుండగా పోలీస్ ఆఫీసర్ వుద్యోగాన్ని వాడు ప్రిఫర్ చేశాడు.

అంతకన్నా చిత్రాతి చిత్రం- వాడికి ఎఫిషియెంట్ పోలీస్ ఆఫీసరుగా పేరొచ్చింది. సిరి సంపదల్తోపాటు, తలలు మార్చే రాజకీయాలకి, లిటిగేషన్లకి, కొట్లాటలకి మారుపేరైన మా జిల్లాకే ప్రత్యేకించి వాడిని పోస్ట్ చేశారిప్పుడు.

"ఏరా నాటకాల వెధవా! పెద్ద రచయితగాడివి కూడా - మాటలే కరువయ్యాయిరా! సరే, నిన్నెలా మాట్లాడించాలో నాకు తెల్సులేరా హీరో" అంటూ భుజం మీద ఒక చరుపు చర్చేడు. 'సత్యభామ కాలి తాపు' కాదది-పోలీసు ఆఫీసర్ దెబ్బ!

ఎన్నెన్నో మాట్లాడుకొన్నాం. ముఖ్యంగా ఆంజనేయులు, రాఘవుడిని గురించి.

ఆ రెండు మంచం కోళ్ళలో వొకటి వంకర తిరిగి పోయింది. రాఘవుడు యిప్పుడు మా వూళ్ళో పేరు మోసిన ప్లీడరు గుమాస్తా. తలలు మార్చడంలో అందరి తల దన్నేడు. స్నేహాలు, ప్రేమలు అన్నీ మర్చిపోయాడు. డబ్బు.... డబ్బు.

ఇక రెండో కాలు రేపోమాపో విరిగిపోవటానికి సిద్ధంగా వుంది.

ఆంజనేయుల్ని యిప్పుడు చూస్తే నాకే భయమేస్తుంది. వాడి భార్య, పిల్లల్ని తల్చుకుంటే మరీ భయమేస్తుంది.

* * *

ఆంజనేయులు చావును కళ్ళారా చూచాను. చిన్న తనంలో మేము రాజకుమారుడుగా భావించిన వాడు, అర్ధాయుష్షుతో నా కళ్ళ ముందే కాలిపోతుంటే అందరితో పాటు కన్నీళ్ళు కార్చటం మినహా ఏం చేయగలను?

స్టాండ్‌లో బస్ దిగి నేరుగా పాండురంగం బంగళాకు బయలు దేరాను. మనసుతోపాటు శరీరం కూడా బరువుగా, బాధగా ఉంది.

దోవలో పోలీస్‌స్టేషన్ దగ్గర జనం గుంపులుగా వుంటే రిక్షా దిగేను. అక్కడ నేను తెల్సుకొన్న విషయం ఇది.

రాత్రి పోలీసులు వేశ్యాగృహాల మీద, జూద గృహాలమీద మెరుపు దాడి జరిపేరు. పట్టుబడ్డ వాళ్ళు పట్టుబడగా కొందరు రౌడీలు తప్పించుకు పారిపోయారు. రాత్రి పొద్దుపొయ్యాక మస్తానయ్య నాయకత్వంలో, పట్టుకొన్న వాళ్ళందర్నీ విడిపించాలని కోరుతూ కొందరు పాండురంగం బంగళాకుపోయారు. మస్తానయ్య, అదుపు పెట్టబోయిన ఇద్దరు పోలీసులమీద చేయి చేసుకోబోయాడు. పట్టుకోబోతే పారిపోయి ఓ రాజకీయ నాయకుడి ఇంట్లో దాక్కొన్నాడు.

రాజకీయ నాయకుడు ఎంత చెప్పినా పాండురంగం మస్తానయ్యను వదిలేయటానికి అంగీకరించలేదు. మస్తానయ్యను అరెస్ట్ చేశాడు.

ఇప్పుడతను పోలీస్ లాకప్‌లో వున్నాడు. అందుకే పోలీస్ స్టేషన్ దగ్గర ఈ జనం.

పాండురంగం వ్యానుదిగటంతో జనం పక్కలకి తప్పుకొన్నారు. భయం భయంగా ఒదిగి నిలబడ్డారు. నేను రిక్షా అతనికి డబ్బులిచ్చి పంపించేసేను.

పాండురంగం-మస్తానయ్య!

ఇద్దర్నీ ఒకప్పుడు ఒక సితిలో చూచాను. ఇప్పుడు ఏ సితిలో చూడబోతున్నానో? ఓవైపు నవ్వు, మరోవైపు వుత్కంఠ.

రాత్రి లాకప్‌లోకి తీసుకొన్న వ్యభిచార గృహాలవారు, రౌడీలు ముందు బయటకొచ్చారు. తలలు వంచుకొని వ్యానెక్కారు.

ఆ తర్వాత మస్తానయ్య పోలీస్‌స్టేషన్‌లో నుంచి బయటి కొచ్చాడు.

ఆశ్చర్యం! పోలీస్ ఎస్కార్టు

కూడా లేదతనికి.

గాంఁడించలేదు. కనీసం తల ఎత్తి చూడలేదు. పులిలాకాదు, పిల్లిలా నడుస్తున్నాడు.

మధ్యలో ఓసారి కాస్త తల ఎత్తాడు. మొహం కన్పించింది. చిత్రం!

మస్తానయ్య ముక్కును కప్పేస్తూ వుండాల్సిన మీసాలు- ఏవీ?

ఆ పొగరుమోతుతనం. ఠీవి, అహంభావం, క్రూరత్వం.... ఎక్కడికెళ్ళేయి?

పాండురంగం నిల్చున్న స్థలం దాకా తలవంచుకు నడిచి,అమాంతం కుప్ప కూలిపోయినట్లు అతని కాళ్ళ మీద పడ్డాడు మస్తానయ్య!

"బాబూ! ముసలాడినైపోయా. బతికినన్నాళ్ళు బతికాను. ఇప్పుడు నన్ను జైలుకు పంపించకండి బాబూ! నా మనవడిలాంటి వాడివి, మీ కాళ్ళు పట్టుకుంటున్నా."

"పోవులే. కానీ కోర్టులో చెప్పు ఇదంతా. అయితే ఓ విషయం గుర్తుంచుకో-మళ్ళీ ఎప్పుడైనా.."

"ఇంకా నా బాబూ? చెప్పేనుగా- జన్మకిక యీ మీసాలు పెంచను."

రూపాయి టిక్కెట్టు పదిరూపాయలు పెట్టి బ్లాకులో కొని చూచిన సినిమా బాగుండకపోతే దిగులు, నిరాశ ముంచుకొచ్చినట్లు, జనం వెఱ్ఱి మొహాలేసుకుని నిరాశగా యిళ్ళ దోవబట్టేరు.

జీపు ఎక్కబోతూ పాండురంగం నన్ను చూచాడు. వాడితోపాటు జీపులో కూర్చోవాలంటే నాకు భయం వేసింది.

"ఏమిటలా వున్నావు? వూరి కెళ్ళేవుటగా? ఆంజనేయులు ఎలా వున్నాడు?"

చెప్పేను—ఆంజనేయులు పోయాడని.

జీపు కోర్టుకెళ్ళలేదు. వాడి బంగళాకెళ్ళింది. వాడూ నాలాగే నిన్నటి నుంచి యీ పనిలో సతమతమవుతూ విశ్రాంతి లేనట్లుంది.

మాట్లాడకుండా యూనిఫాం విప్పేసి స్నానంచేసి వచ్చాడు. నన్నూ స్నానంచేసి రమ్మన్నాడు. కానీ నాకది సాధ్యంకాదు. ఒక విషయం తెల్సుకుంటేనే గాని నా మనసు, దేహం శాంతించదు.

'మస్తానయ్య అంతలా అంతగా ఎలా మారిపోయాడు? ఆ మార్పు నిజమా? రేపు కక్షకట్టి తననేమైనా చేస్తారన్న భయం పాండురంగానికి లేదా?'

నా ప్రశ్న విని పాండురంగం నవ్వేడు.

"ఓటమి నుంచి నాపై నేను విశ్వాసాన్ని పెంచుకొన్నాను. పిరికితనం నుంచి ధైర్యం పెరిగింది నాలో. కానీ మరో టుంది- నా ధైర్యమంతా నాదికాదు. యిప్పుడు నేను విప్పేసేనే-ఆ నా యూనిఫాంది కూడా. యూనిఫాంలో నేను పులిని. విప్పేస్తే మామూలు పాండురంగాన్ని. అలాగే మస్తానయ్య ప్రదర్శించే ధైర్యంలో అతని మీసాలకి, అతని బిరుదులకి కూడా భాగం వుంది. మీసాలు గొరిగేసుకోమంటే వో పట్టాన వొప్పుకున్నాడు కాదు. గొరిగేసుకొన్నాక పిల్లిలా మారేడు. కాగా జైలంటే అతడికి అమిత భయం. పోలీసువాడికి నేరస్తుడి సైకాలజీ, నేరస్తుడికి ప్రజల సైకాలజీ బాగా తెలిసి వుంటేనే కాని తమ పనుల్ని చేయలేరు."

నాకేం ప్రశ్నలడగా లనిపించ లేదు. స్నానానికి వెళ్ళేను. తిరిగి వచ్చేసరికి నాకళ్ళపడ్డ దృశ్యం నాకపూర్వంగా క్షణకాలం అనిపించింది.

పాండురంగం బాసింపట్లు వేసుకొని పద్మాసనంలో కళ్ళు మూసుకొని నేలమీద స్థిరంగా కూర్చొని వున్నాడు-మునిలా. దేన్నీ గుర్తించే స్థితిలో లేడు. మొహం ప్రశాంతంగా వుంది.

అరగంట తర్వాత కాని కళ్ళు తెరవలేదు వాడు. తెరిచిన వాడి కళ్ళల్లో వుజ్వలమైన కాంతి!

ప్రశాంతంగా నవ్వేడు. నన్ను చూచి కాదనిపించింది, నాలో అజ్ఞానాన్ని చూచా?

అప్పుడు నాకనిపించింది-వాడి అరగంట తపస్సు-సాధన! ఆత్మశక్తికోసం, నిగ్రహం కోసం చేసిన సాధన!

వాడి విజయానికి మూలం అదే!

మిగతా మూడు మంచంకోళ్ళ నుంచి వేరుచేసి వాడిని వున్నతం చేసిన శక్తి అదే—అదే! *

Published by K. Rajendra Babu. 80, Dhanalaxmi Colony, Madras- 600 026 and Printed by Vijaya Bapineedu at Vijaya Graphics, 8, Arcot Road, Madras- 600 026. Phone: 422233
Editor : VIJAYA BAPINEEDU.